క్లుప్తంగా

సిరులతల్లికి పంచామృతాభిషేకం



ప్రత్యేక అలంకరణలో కనకమహాలక్ష్మి

దాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనక మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో గురువారం త్రికాల పంచామృతాభిషేకం జరిపారు. ఈ సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. ఈ ప్రత్యేక పూజను పరోక్ష పద్ధతిలో చేసుకునే ఆసక్తి గల భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు బ్రాంచ్, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081లో చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఏఈవోలు కె. తిరుమలేశ్వరరావు, వెంపలి రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

నాగమల్లేశ్వరికి సత్కారం



నాగమల్లేశ్వరిని సత్కరిస్తున్న కేంద్ర మంత్రి రాందాస్ అత్వాలి

దాబాగార్డెన్స్ : న్యూహోప్ వ్యవస్థాపకురాలు డాక్టర్ మంచా నాగమల్లేశ్వరి అందిస్తున్న సేవా కార్యక్రమాలను గుర్తించి కేంద్ర మంత్రి రాందాస్ అత్వాలి గురువారం హైదరాబాద్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో ఆమెను సత్కరించారు. మరిన్ని సేవలు చేస్తూ ముందుకు సాగాలని సూచించారు. నాగమల్లేశ్వరి గత 10 సంవత్సరాలుగా ఎంతో మంది చిన్నారులు, ఆడపిల్లలకి గుడ్ టచ్ అండ్ బ్యాడ్ టచ్ పేరిట అవగాహన కార్యక్రమాలు చేపట్టారు.

ఏఎంసీలో ఓటు అవగాహన కార్యక్రమం



ప్రసంగిస్తున్న సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రామారావు

మహారాణిపేట : ఆంధ్రా మెడికల్ కాలేజీలో వైద్య విద్యార్థులకు ఓటు హక్కుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు, సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రామారావు ఈ సందర్భంగా వైద్య విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు. ఓటింగ్ అవశ్యకతను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ మనోజ్, పలువురు వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

అప్పన్న అన్నప్రసాద పథకానికి రూ.4 లక్షల విరాళం



దేవదాయశాఖ కమిషనర్ సత్యనారాయణకు చెక్కు అందజేస్తున్న అక్షయ ఆస్పత్రి ప్రతినిధి

సింహాచలం: చందనోత్సవాన్ని పురస్కరించుకుని శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం శాశ్వత అన్నప్రసాద పథకానికి గురువారం నగరంలోని న్యూకాలనీలోని అక్షయ ఆస్పత్రి యాజమాన్యం రూ.4 లక్షల విరాళం దేవదాయశాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణకు చెక్కు రూపంలో అందజేసింది. దేవదాయశాఖ అడిషనల్ కమిషనర్ కె.రామచంద్ర మోహన్, సింహాచలం దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి, దేవస్థానం ట్రస్ట్‌బోర్డు మాజీ సభ్యుడు గంట్ల శ్రీనుబాబు పాల్గొన్నారు.

వేడుక ఏదైనా.. వేదిక సిద్ధం



రెల్లివీధిలో గల అంబేద్కర్ కల్యాణ మండపం

డెవలప్‌మెంట్ వాచ్



వన్‌టౌన్‌లోని షాదీఖానా

- సామాన్యులకు అందుబాటులో కల్యాణ మండపాలు.. సామాజిక భవనాలు
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు

దాబాగార్డెన్స్ : దశాబ్ద కాలంగా విశాఖ మహానగరం అనూహ్యంగా విస్తరించింది. పట్టణం విస్తరించడంతో పరిశ్రమలు క్యూ కడుతున్నాయి. పరిశ్రమలు ఏర్పడుతుండడంతో పట్టణానికి వలసలు పెరిగాయి. కనీసం కూలి పని చేసుకునైనా పట్టణంలో బతకొచ్చన్న ఆలోచనతో ప్రజలు పెద్ద ఎత్తున గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణానికి తరలి వస్తున్నారు. వీరంతా ముఖ్యంగా మురికివాడల్లో నివాసాలు ఏర్పరుచుకుంటున్నారు. దీంతో మురికివాడల్లో జనాభా పెరుగుతోంది. అందుకు తగ్గ మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. ముఖ్యమంత్రి జగన్ మోహనరెడ్డి అధికారం చేపట్టిన నాటి నుంచి విశాఖ మహానగరం అభివృద్ధిపై దృష్టి సారించారు. ఇప్పటికే నగరాభివృద్ధికి.. సుందరీకరణకు పెద్ద ఎత్తున చర్యలు చేపట్టారు. నగరంలో జనాభా పెరుగుతున్న నేపథ్యంలో నూతనంగా అనేక కాలనీలు వెలిసాయి. అక్కడ మౌలిక సదుపాయాల ఏర్పాటుకు జీవీఎంసీ శ్రీకారం చుట్టింది. దీనిలో భాగంగా వార్డుల పరిధిలో గల పలు ప్రాంతాల్లో సామాజిక భవనాల ఆవశ్యకతను దృష్టిలో పెట్టుకుని వాటిని అభివృద్ధి చేసే దిశగా జీవీఎంసీ ముందడుగు వేసింది. ఇప్పటికే నియోజకవర్గంలో గల పలు సామాజిక భవనాలు, జీవీఎంసీ కల్యాణ మండపాలను అభివృద్ధి చేశారు.



లక్ష్మీ టాకీస్ వద్ద గల మత్స్యకార భవనం



ఫెర్రీరోడ్డులో గల జీవీఎంసీ కల్యాణ మండపం

అభివృద్ధిపథాన కల్యాణ మండపాలు.. సామాజిక భవనాలు..

నియోజకవర్గ పరిధిలో జీవీఎంసీకి చెందిన పలు కల్యాణ మండపాలు, సామాజిక భవనాలున్నాయి. వీటిలో పేద, మధ్య తరగతి కుటుంబాల వారు శుభ కార్యాలు నిర్వహించుకుంటున్నారు. వీరిని దృష్టిలో పెట్టుకుని నియోజకవర్గ పరిధిలో గల పలు కల్యాణ మండపాలు, సామాజిక భవనాలను జీవీఎంసీ అభివృద్ధి చేస్తోంది. 29వ వార్డు శ్రీరంగపురం కల్యాణ మండపం, 30వ వార్డులో తాడివీధి కమ్యూనిటీ భవన్, 31వ వార్డు గొల్లలపాలెంలో సామాజిక భవనం, 34వ వార్డు కొబ్బరితోట వద్ద కల్యాణ మండపం, 35వ వార్డులో సైలాడ పైడితల్లినాయుడు కల్యాణ మండపం, 36వ వార్డు గొడారిగోతుల్లో సామాజిక భవనం, 37వ వార్డులో అంబేడ్కర్ కల్యాణ మండపం, 38వ వార్డు మట్టా వెంకటప్పయ్య వీధిలో విశ్వబ్రాహ్మణ కమ్యూనిటీ భవన్, 39వ వార్డులో షాదీఖానా, ఫెర్రీ రోడ్డులో జీవీఎంసీ కల్యాణమండపం.. ఇలా పలు వార్డుల్లో గల జీవీఎంసీ కల్యాణ మండపాలు, సామాజిక భవనాలను అభివృద్ధి చేసి అందుబాటులోకి తీసుకొచ్చారు.



38వ వార్డు మట్టావెంకటప్పయ్య వీధిలో గల విశ్వబ్రాహ్మణ కల్యాణ మండపం



39వ వార్డు పాతపోస్టాఫీస్ వద్ద గల మత్స్యకార సామాజిక భవనం

త్రైత సిద్ధాంత ఉగాది తెలుగు క్యాలెండర్ ఆవిష్కరణ



త్రైత సిద్ధాంత క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న వాసుపల్లి గణేష్‌కుమార్ తదితరులు

అల్లిపురం : క్రోధి నామ సంవత్సర త్రైత సిద్ధాంత ఉగాది తెలుగు క్యాలెండర్‌ను దక్షిణ ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి గణేష్‌కుమార్ ఆవిష్కరించారు. ఆశీలమెట్ట దరి వాసుపల్లి కార్యాలయంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞానవేదిక విశాఖపట్నం కమిటీ, విజయరాంపురం కమిటీ, ఆనందాశ్రమం అధ్యక్షుడు శ్రీనివాస్, కె.త్రినాథరావు, గౌతమి శివకుమార్ ఆధ్వర్యంలో ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులచే రూపొందించబడిన క్యాలెండర్‌ను గురువారం వాసుపల్లి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్రైత సిద్ధాంత భక్తులు వైఎస్సార్ సీపీకి మద్దతు పలకడం సంతోషంగా ఉందన్నారు. దక్షిణలో ఎక్కడికి వెళ్లినా ప్రజలు ఆదరిస్తున్నారని, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలే పార్టీని గెలిపిస్తాయన్నారు.

ఈ అభివృద్ధి, సంక్షేమం కొనసాగాలంటే జగనన్ననే మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాలని తెలిపారు. వైఎస్సార్‌సీపీ అంటే సంక్షేమం అని ప్రజలు గుర్తించారన్నారు. కార్యక్రమంలో సభ్యులు శ్రీనివాస్, కె.త్రినాథరావు, గౌతమ్ శివకుమార్, కృష్ణ, సూరప్పడు, జయరాం, గోవిందు, నారాయణ, గురప్ప తదితరులు పాల్గొన్నారు.

అదే జోరు.. చేరికల హుషారు



పార్టీలో చేరిన బంగారుమెట్ట జనసేన యువత, టీడీపీ మహిళలతో వాసుపల్లి గణేష్‌కుమార్

- వైఎస్సార్‌సీపీలోకి పలు పార్టీల నేతలు.. సంఘాల నాయకులు.. అభిమానులు

అల్లిపురం: యువతకు భరోసా జగనన్నే అని దక్షిణ ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి గణేష్‌కుమార్ అన్నారు. జీవీఎంసీ 33వ వార్డు బంగారుమెట్ట వద్ద గురువారం జరిగిన కార్యక్రమంలో బూర్లె చిన్న ఆధ్వర్యంలో జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి పచ్చిరిపల్లి రాము, ఎం.రమేష్ సారథ్యంలో బంగారమెట్టకు చెందిన సుమారు 200 మంది జనసేన యువత, టీడీపీ మహిళలు వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి వాసుపల్లి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో డబ్బాడ సురేష్, సంపంగి మహేంద్ర, నరేంద్ర, బాజీ, మహేష్‌రెడ్డి, సునీల్ సాయి, గోవిందమ్మ, దేవి, రేణుక, బి.దేవి తదితరులున్నారు.

29వ వార్డు నుంచి..

ఆకుల రవి ఆధ్వర్యంలో 37వ వార్డు యూత్ ప్రెసిడెంట్ ప్రసాద్‌తో పాటు, భారీగా జనసేన, టీడీపీ నుంచి యువత, మహిళలు పార్టీలో చేరారు. వారికి కండువాలు కప్పి వాసుపల్లి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో కె.కిరణ్, వికాస్, రాజ్ కుమార్, డి.నిర్మల, డి.రాజు, ఆకుల విజయబాబు, బి.రాకేష్ తదితరులున్నారు.



జనసేన యువత, టీడీపీ మహిళలతో వాసుపల్లి

ఆటో కార్మికుల చేరిక..

వాసుపల్లి రాజు ఆధ్వర్యంలో చింతకాయలవారి వీధికి చెందిన శ్రీ సాగరదుర్గ భవానీ ఆటో స్టాండ్ కార్మికులు, టీడీపీ కార్యకర్తలు సుమారు 50 మంది వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి కండువాలు కప్పి వాసుపల్లి పార్టీలోకి ఆహ్వానించారు.

పార్టీలో చేరిన బంగారమ్మ ఫిషింగ్ నెట్ మేకర్స్, వర్కర్స్.. రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ బొల్లవరపు జాన్‌వెస్లీ సమక్షంలో శ్రీ బంగారమ్మ ఫిషింగ్ నెట్ మేకర్స్, వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు సూరాడ రాజారావు, ఉపాధ్యక్షుడు చింతకాయల బంగారయ్య, కార్యదర్శి చేపల పరదేశి ఆధ్వర్యంలో అసోసియేషన్ సభ్యులు వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి కండువాలు కప్పి వాసుపల్లి పార్టీలోకి ఆహ్వానించారు.

37వ వార్డు నుంచి..

వార్డు నాయకుడు అశోక్ ఆధ్వర్యంలో రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ బొల్లవరపు జాన్ వెస్లీ సమక్షంలో రెల్లివీధి, శ్రీ పోలమాంబ ఆటోస్టాండ్ అధ్యక్షుడు తుపాకుల ఈశ్వరరావుతో పాటు 50 మంది వైఎస్సార్‌సీపీలో చేరారు. ఈ సందర్భంగా ఖాకీ షర్టు వేసుకుని వాసుపల్లి వారిని ఉత్సాహపరిచారు. కండువాలు కప్పి వారిని పార్టీలోకి ఆహ్వానించారు.

పార్టీలో చేరిన సీరత్ కమిటీ ప్రతినిధులు..

రాష్ట్ర మైనార్టీ సెల్ కార్యదర్శి ఖాజావలీ ఆధ్వర్యంలో సీరత్ కమిటీ ప్రతినిధులు పార్టీలో చేరారు. వారికి కండువాలు కప్పి వాసుపల్లి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ దక్షిణలో వాసుపల్లి గెలుపు ఖాయమన్నారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు షేక్ అబ్దుల్ లతీఫ్, ముస్తఫా, ఆహ్మద్, మునీర్‌బాబా, ఎస్‌కే అహ్మద్‌వలి తదితరులు పాల్గొన్నారు.



ఆటో కార్మికులను పార్టీలోకి ఆహ్వానిస్తున్న వాసుపల్లి గణేష్‌కుమార్



బంగారమ్మ ఫిషింగ్ నెట్ మేకర్స్, వర్కర్లతో జాన్‌వెస్లీ, వాసుపల్లి గణేష్‌కుమార్



సీరత్ కమిటీ ప్రతినిధులతో జాన్‌వెస్లీ, వాసుపల్లి



ఖాకీ షర్ట్ ధరించి 37వ వార్డు ఆటో కార్మికులను ఉత్సాహపరుస్తున్న వాసుపల్లి

ఈవీఎంల రెండో విడత ర్యాండమైజేషన్ పూర్తి



రెండో విడత సప్లిమెంటరీ ర్యాండమైజేషన్ నిర్వహిస్తున్న కలెక్టర్ మల్లికార్జున

మహారాణిపేట : విశాఖ పార్లమెంటు నియోజకవర్గం పరిధిలోని ఎస్.కోట నియోజకవర్గంలో వినియోగించనున్న ఈవీఎంల రెండో విడత సప్లిమెంటరీ ర్యాండమైజేషన్ ప్రక్రియ గురువారం పూర్తయింది. సాధారణ పరిశీలకులు అమిత్ శర్మ ఆధ్వర్యంలో రాజకీయ పార్టీల అభ్యర్థుల సమక్షంలో జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ మల్లికార్జున కలెక్టరేట్ వీసీ హాల్లో ఆన్‌లైన్ విధానంలో ఈ ప్రక్రియను పూర్తి చేశారు. కమిషనింగ్ పూర్తి అయిన తర్వాత సాంకేతిక కారణాల వల్ల పని చేయని కొన్ని కంట్రోల్ యూనిట్లను రిజర్వ్ నుంచి కేటాయించి రిప్లేస్ చేశారు. ఈ నేపథ్యంలో వాటి స్థానంలో మరో 116 ఈవీఎంలను రిజర్వ్ కోటా కింద కేటాయిస్తూ జిల్లా ఎన్నికల అధికారి నిర్ణయం తీసుకున్నారు. ప్రక్రియను సాధారణ పరిశీలకులు అమిత్‌శర్మ ఆన్‌లైన్ ద్వారా పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో వివిధ రాజకీయ పార్టీల అభ్యర్థులు, జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్‌కుమార్, ఈవీఎంల నోడల్ అధికారి టి.ప్రవీణ, ఎలక్షన్ సెల్ డీటీ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నేతల ఇంటింటి ప్రచారం

తాటిచెట్లపాలెం : రాబోయే ఎన్నికల్లో ఎంపీగా బొత్స ఝాన్సీలక్ష్మి, ఎమ్మెల్యేగా వాసుపల్లి గణేష్ కుమార్‌ను గెలిపించాలని జీవీఎంసీ 42వ వార్డులో వైఎస్సార్‌సీపీ నాయకుడు ఆళ్ల శ్రీనివాసరావు ప్రచారం చేశారు. వార్డు పరిధి వినాయక గుడి నుండి ఆయా బూత్‌ల పరిధిలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వాసుపల్లి గణేష్‌కుమార్ కోడలు రాశి కూడా పాల్గొన్నారు. వైఎస్సార్‌సీపీ విశాఖ ఎంపీగా బొత్స ఝాన్సీలక్ష్మి, దక్షిణ ఎమ్మెల్యేగా వాసుపల్లి గణేష్‌కుమార్‌ను గెలిపించాలని ఇంటింటికీ తిరిగి స్థానికులను కోరారు. ఈ కార్యక్రమంలో రాజుపాత్రుడు, డైరెక్టర్లు ఎస్. ప్రసాదరావు, నాగమణి, గౌరి, జయరాం, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, బూత్ కన్వీనర్లు, మహిళలు పాల్గొన్నారు.



రైల్వేన్యూకాలనీ వినాయక గుడి నుండి ప్రచారం ప్రారంభిస్తున్న పార్టీ శ్రేణులు

ఆహార నియమాలతో సంపూర్ణ ఆరోగ్యం

దాబాగార్డెన్స్ : స్నేహ సంధ్య ఏజ్‌కేర్ ఫౌండేషన్ గత 15 ఏళ్లుగా ఉచితంగా బీపీ, షుగర్‌కు వైద్య సేవలందిస్తోందని స్వామి వివేకానంద స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు తెలిపారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతి నెలా రెండో గురువారం ఉచితంగా వైద్య సేవలందిస్తున్నట్లు తెలిపారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎస్ఎస్ రాజు నేతృత్వంలో సంస్థలో ఆశ్రయం పొందుతున్న వారితో పాటు పరిసర ప్రాంతాల వృద్ధులు, పేదలకు ఉచితంగా వైద్య సేవలు, మందులు అందజేస్తున్నారని తెలిపారు. డాక్టర్ ఎస్ఎస్ రాజు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వైద్య సేవలు వినియోగించుకోవాలని, ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు పాటించాలని సూచించారు. సమయానికి మందులు వేసుకోవాలని, శరీరానికి వ్యాయామం కూడా చాలా అవసరమని, ఆహార నియమాలు పాటించాలని తెలిపారు. ఈ సందర్భంగా సంస్థ సభ్యులు డాక్టర్ ఎస్ఎస్ రాజును సత్కరించారు. కార్యక్రమంలో సత్తిబాబు, భానోజీరావు, మహిళా సభ్యులతో పాటు వైద్య బృందం పుండరీకాక్ష, ప్రసాద్‌నాయుడు, సాయి చందు, సుమతి, కమల ప్రియ తదితరులు పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ ఎస్ఎస్ రాజు

మార్కెట్లకు వేసవి దెబ్బ

- కొనుగోలుదారులు లేక డీలా పడిన పూర్ణామార్కెట్, రామకృష్ణా రైతుబజార్ వ్యాపారులు



ఎప్పుడూ రద్దీగా ఉండే పూర్ణామార్కెట్ వెలవెలబోతూ ఇలా..



నిర్మానుష్యంగా రామకృష్ణా రైతుబజార్ ప్రాంతం

జగదాంబ : భానుడి భగభగలతో మార్కెట్లు కళ తప్పాయి. ఈ ఏడాది సూర్యతాపం ఎలా ఉందో అందరికీ తెలిసిందే. ఏప్రిల్ నుంచే ఎండలు ఠారెత్తిస్తున్నాయి. దీంతో ప్రజలు బయటికి రావడానికి కూడా బెంబేలెత్తిపోతున్నారు. దీంతో వ్యాపారాలు నత్త నడకన సాగుతున్నాయి. అత్యంత కీలకమైన పూర్ణామార్కెట్‌కు నిత్యం విశాఖపట్నంతో పాటు విజయనగరం, శ్రీకాకుళం, అనకాపల్లి, అల్లూరి జిల్లాల నుంచి కూడా కొనుగోలుదారులు వస్తుంటారు. దీంతో నిత్యం జనసంచారంతో ఈ ప్రాంతం కళకళలాడిపోతుండేది. అయితే ఈ ఏడాది ఎండల ధాటికి జనసంచారం లేక వ్యాపారాలు సాగడం లేదని వ్యాపారులు వాపోతున్నారు. తెచ్చిన సరుకు తెచ్చినట్లే ఉండిపోతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాతనగరంలోని రామకృష్ణా రైతుబజార్ పరిస్థితి కూడా అలాగే ఉందని అక్కడి వ్యాపారులు కూడా దిగాలు పడుతున్నారు.

మరింత ఉడుకెత్తిస్తున్న చిరు జల్లులు..

బుధ, గురువారాల్లో కురిసిన చిన్నపాటి వర్షం వల్ల నేలలోని వేడి మరింతగా పైకి వచ్చి మధ్యాహ్నం అయ్యేసరికి ఉక్కపోతతో ఇక్కట్లు పడుతున్నామని వ్యాపారులంటున్నారు. వేసవి ముందుగానే వచ్చినట్లు ఏప్రిల్ మొదటి నుండి ఇలాగే ఉండడం వల్ల వ్యాపారపరంగా చాలా నష్టాలు చవిచూస్తున్నామని ఆవేదనకు లోనయ్యారు.

జ్యూట్ బ్యాగుల తయారీలో కొత్తవారికి అవకాశం



జ్యూట్ బ్యాగులు తయారు చేస్తున్న మహిళలు

మురళీనగర్: జ్యూట్ బ్యాగుల తయారీ ఉచిత శిక్షణ తరగతుల్లో చేరడానికి కొత్త వారికి అవకాశం ఇస్తున్నట్లు మానవ సేవే మాధవ సేవ అసోసియేషన్ అధ్యక్షుడు సనపల భానుప్రకాష్ తెలిపారు. గురువారం ఆయన శిక్షణ శిబిరాన్ని సందర్శించారు. తమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శిక్షణకు మహిళల నుంచి మంచి ఆదరణ లభిస్తోందన్నారు. ఈ నెల 12 వరకు శిక్షణ కొనసాగిస్తామని, ఆసక్తి గల మహిళలు చేరవచ్చని చెప్పారు. శిక్షకురాలు సుగుణ ఆధ్వర్యంలో మహిళలు జ్యూట్ బ్యాగుల తయారీలో మెళకువలు నేర్చుకుంటున్నారు. ఈ సందర్భంగా మహిళలు తయారు చేసిన బ్యాగులు ప్రదర్శించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు డి.వరప్రసాద్, కార్యదర్శి ఎస్.సీతారామకృష్ణ, సహాయ కార్యదర్శి పి.సతీష్ కుమార్, ఎస్ఎస్‌వీ ప్రసాదరావు, శ్రీను, పీఎస్ఆర్ సూరిబాబు పాల్గొన్నారు.

19న దుర్గమాంబ జాతర

కంచరపాలెం: జీవీఎంసీ 46వ వార్డు కైలాసపురం శాంతినగర్ వాసుల ఆరాధ్య దైవం దుర్గమాంబ అమ్మవారి జాతర మహోత్సవం ఈ నెల 19న నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శాంతినగర్ కొండవాలు ప్రాంతంలో కొలువైన అమ్మవారిని 16 గ్రామాల ప్రజలు ఇలవేల్పుగా కొలుస్తుంటారు. ఈ నెల 18న తొలేళ్లు, 19న ప్రధాన జాతర జరుగుతాయని ఆలయ ధర్మకర్త ఎరిపిల్లి అప్పారావు తెలిపారు. భక్తులకు ప్రత్యేక దర్శనాలు, అన్నసమారాధన, సాయంత్రం సాంస్కృతిక ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు.